క్లుప్తంగా

జవాన్లకు నివాళి



మరికల్: జమ్మూ కాశ్మీర్ ఉగ్రదాడిలో మరణించిన వీర జవాన్లకు మరికల్, పెద్దచింతకుంట యువక మండలి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారుల వెంట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భం జవాన్ల చిత్ర పటాలకు నివాళి అర్పించారు.

24 నుంచి క్రీడా పోటీలు

మాగనూర్: స్కిప్పింగ్ డేను పురస్కరించుకుని మండల కేంద్రంలో ఈ నెల 24న ఉమ్మడి మాగనూర్, కృష్ణ మండల విద్యార్థినులకు పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా షూటింగ్ బాల్, టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు ఉంటాయని రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, విశ్రాంత పీఈటీ బీ గోపాలం శుక్రవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని సూచించారు. అసోసియేషన్ మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

23న గురుకుల ప్రవేశ పరీక్ష

మరికల్: గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్షను ఈ నెల 23న ఆదివారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అనూరాధ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. హాల్ టికెట్, పెన్నులు, వాటర్ బాటిల్ వెంట తెచ్చుకోవాలని వివరించారు.

ధన్వాడ: గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశానికి ఈ నెల 23న అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు కొండాపూర్ ప్రిన్సిపాల్ ఎం.రాజారాం శుక్రవారం తెలిపారు. విద్యార్థులు సకాలంలో చేరుకోవాలని సూచించారు.

నియో ఆల్ఫాక్లబ్ ప్రారంభం

మక్తల్: నియో ఆల్ఫా క్లబ్‌ను పాస్ట్ డిస్ట్రిక్ కేబినెట్ కార్యదర్శి ఆత్మారామ్ హెర్డే మక్తల్ బీమా ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మక్తల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, నియో క్లబ్ అధ్యక్షుడు బండారి ఖుషి, చంద్రహాస్, కోశాధికారి లక్ష్మి, అర్జున్, బోర్డు డైరెక్టర్లు ఊర్మిళ, వైష్ణవి, మధుప్రియ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం



కోస్గి: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 9వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మ్యాకల శిరీష ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాశాలలోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పరమేశ్వరి, ఎస్టీఓ వీరప్రతాప్‌తోపాటు కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రంలో శుక్రవారం క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీటీసీ కిరణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు అహ్మద్‌పాషా, గౌరీశంకర్, నర్సింహులు, భూమీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

మక్తల్: వీఓఏలు తమకు న్యాయం చేయాలంటూ, కనీసం వేతనం అందించాలంటూ చేపట్టిన సమ్మె శుక్రవారం ఐదోరోజు కొనసాగింది. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద కొనసాగుతున్న కార్యక్రమంలో జ్యోతి, చంద్రకళ, వెంకట్‌రాములు, బాలయ్య, రాంరెడ్డి, రాజు, రాము, సంతోష, శమంతకమణి, రాధమ్మ, వెంకటేష్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మద్దూర్: మండల కేంద్రంలో వీఓఏలో సమ్మె శుక్రవారం 5వ రోజు కొనసాగింది. డీవైఎఫ్ఐ జిల్లా సహకార కార్యదర్శి కనకప్ప, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ హాజరై తమ మద్దతు ప్రకటించారు. బుగ్గప్ప, లక్ష్మణ్ నాయక్, కాజన్న, లాలప్ప పాల్గొన్నారు.

అర్చక సంఘం ప్రతినిధిగా మంజునాథ స్వామి

నారాయణపేట రూరల్ : తెలంగాణ జంగమ అర్చక పురోహిత సంక్షేమ సంఘం నారాయణపేట జిల్లా ప్రతినిధిగా బసవేశ్వర ఆలయం ప్రధాన అర్చకులు మంజునాథ స్వామి నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పురంతు వీరయ్యస్వామి శుక్రవారం నియామక ఉత్తర్వులను అందించారు. సంఘ పరంగా కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా చేపట్టాలని సూచించారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



విందులో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

మాగనూర్: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ముస్లింలకు శుక్రవారం ఘనంగా ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే , ప్రజాప్రతినిధులు, అఖిలపక్ష నాయకులు, గ్రామస్తులు ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే చిట్టెం మాట్లాడుతూ..పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, జెడ్పీటీసీ వెంకటయ్య, వైస్ ఎంపీపీ దూల తీపయ్య, ఎంపీటీసీ ఎల్లారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీనివాసులు, అశోక్‌గౌడ్, మక్తల్ సీఐ సీతయ్య, ఖాజాహుస్సేన్, సుల్తాన్ పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలోని ముస్లింలకు ప్రభుత్వ పరంగా రెవెన్యూ శాఖ తరఫున శుక్రవారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు సుధాకర్‌రెడ్డి, శ్రీశైలం, రవి, బసంత్, రామస్వామి, రాములు, గోపాల్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ

నారాయణపేట రూరల్ : మండలంలోని జాజాపూర్ రంజాన్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. సర్పంచ్ సుగంధమ్మ చేతుల మీదుగా కార్యక్రమం నిర్వహించారు. జగన్మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటప్ప పాల్గొన్నారు.

ముస్లింలకు దుస్తుల పంపిణీ

మాగనూర్: రంజాన్‌ను పురస్కరించుకుని మండల పరిధిలోని కొత్తపల్లిలో సర్పంచ్ తిమ్మప్ప ఆధ్వర్యంలో ముస్లింలకు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బంగి లక్ష్మి, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ అంజమ్మ, సంజీవ్, దేవరాజు, శంకర్, రజాక్, తాయప్ప, ఆంజనేయులు పాల్గొన్నారు.

మక్తల్: రంజాన్‌ను పురస్కరించుకుని మండల పరిధిలోని పంచదేవ్ పాడులో మైనార్టీలకు సర్పంచ్ కల్పన చేతుల మీదుగా దుస్తులు శుక్రవారం పంపిణీ చేశారు. కృష్ణయ్య పాల్గొన్నారు.

రోడ్డు ఎత్తును తగ్గించాలని ఆందోళన

మరికల్: రోడ్డు ఎత్తులో ఉండటం వల్ల వర్షపునీరు ఇళ్లలోకి వస్తోందని తగ్గించాలని శుక్రవారం వెంకటాపూర్ గ్రామస్తులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. అధికారులు ముందు చూపు లేకుండా 2010లో తీలేర్ నుంచి వెంకటాపూర్ వరకు వేసిన బీటీరోడ్డు వల్ల 13 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ప్రస్తుతం రోడ్డు మరమ్మతు పేరుతో మరింత ఎత్తుకు పెంచేందుకు చర్యలు తీసుకోవడంతో పనులను అడ్డుకున్నారు. బీటీరోడ్డు స్థానంలో సీసీరోడ్డు వేసి రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించాలని లేనిచో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కాల్వ పూడ్చివేతను అడ్డుకోవాలని వినతి



వినతి పత్రం ఇస్తున్న కాలనీ వాసులు

మరికల్: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో కొందరు చెరువుకు వెళ్లే పాటు కాల్వను పూడ్చివేసి ఆ స్థలంను కబ్జా చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. పూడ్చివేత పనులను వెంటనే అడ్డుకోవాలని శుక్రవారం తహసీల్దార్ రాంకోటికి వినతి పత్రానిచ్చారు. బీసీ కాలనీలో సమీపంలో కనకల్ చెరువుకు వచ్చే ఈ పాటుకాల్వను పూడ్చివేసి ప్లాట్లుగా మార్చుకొని అమ్ముకొనేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో ప్రజాప్రతినిధులు ఎమీ పట్టనట్లు వ్యహరిస్తున్నారని వాపోయారు. రవి, రాములు, కతల్, మొగులప్ప, పాల్గొన్నారు.

రంజాన్ సందర్భంగా విస్తృత తనిఖీలు

నారాయణపేట రూరల్ : రంజాన్ పండుగను పురస్కరించుకుని పోలీసులు జిల్లా కేంద్రంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. జిల్లాలోకి ప్రవేశిస్తున్న వాహనాలను పరిశీలించారు. అదేవిధంగా ఈద్గా, మసీదులతో పాటు ప్రార్థనా స్థలాల్లో బాంబ్ డిస్పోసల్ టీమ్‌తో క్షుణంగా తనిఖీలు చేపట్టారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకున్నట్లు సీఐ రవిబాబు తెలిపారు. ప్రధాన కూడళ్లు, ప్రార్థన స్థలాల్లో అవసరానికి తగినట్లు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా ఎస్ఐ సురేష్‌తో కలిసి బువ్వమ్మ గుట్ట దర్గా, ఈద్గా, మసీదులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అవసరమైన సూచనలు చేశారు.

ఈద్గా ప్రాంగణంలో పారిశుద్ధ్య చర్యలు

నారాయణపేట టౌన్ : రంజాన్‌ను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని బహర్‌పేట బువ్వమ్మ దర్గా సమీపంలోని ఈద్గా ప్రాంగణం వద్ద మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. కమిషనర్ సునీత ఆధ్వర్యంలో చెత్తచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, ముళ్లపొదలు, పిచ్చి మొక్కలను తొలగింప చేశారు. రంజాన్ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు. మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బసవజయంతి విజయవంతం చేద్దాం

కృష్ణా: బసవ జయంతి కార్యక్రమాన్ని ఉమ్మడి మండలాల్లో విజయవంతం చేయాలని వీరశైవ సమాజం జిల్లా నాయకులు శివరాజ్‌పాటీల్, మజ్జిగ సురేష్‌లు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం 8 గంటలకు హిందూపూర్‌లోని జగజ్యోతి బసవేశ్వర విగ్రహానికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. తరువాత 9 గంటలకు మాగనూర్ మండల కేంద్రంలో బసవ జయంతి కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, నేరడగం పీఠాధిపతి పంచమ సిద్ధలింగ మహాస్వామి, చేగుంట క్షీరలింగ స్వామి హాజరవుతున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు ఉమ్మడి మండలంలోని వీరశైవులు విధిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఉమ్మడి మండల వీరశైవ సమాజం అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, మల్లికార్జున్‌స్వామి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

25న సమావేశం

మక్తల్: నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 25 నిర్వహించడంపై శుక్రవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. కార్యకర్తల సమావేశం భారీగా నిర్వహించేందుకు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. మక్తల్, మాగనూర్, ఆత్మకూర్, మదనాపూర్, మరికల్, నర్వ, ఊట్కూర్ , అమరచింత మండలాల నాయకులు, కార్యకర్తలు సమావేశానికి రానున్నారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప, మాగనూర్ జెడ్పీటీసీ వెంకటయ్య, మార్కెట్ చైర్మన్ రాజు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం రద్దు



సమావేశ మందిరం నుంచి బయటకు వస్తున్న సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు

నారాయణపేట రూరల్ : పేట సర్వసభ్య సమావేశం శుక్రవారం అర్థాంతరంగా రద్దయ్యింది. బిల్లులు రాలేదన్న ఆవేదనతో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు కలిసి బైకాట్ చేస్తున్నామని పేర్కొనగా.. మండల పరిషత్ అధ్యక్షుడు అధికారులు సమయానికి రాలేదని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా ఎందుకు సమావేశం రద్దయ్యిందో స్పష్టంగా పరిషత్ అధికారులు ప్రకటించలేదు. వివరాల్లోకి వెళ్తే శుక్రవారం సమావేశానికి ఏర్పాట్లు చేశారు. 11గంటలకు సమావేశ మందిరానికి 8 ఎంపీటీసీ సభ్యులు, 7 అధికారులు వచ్చారు. కానీ అప్పటికే సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు చర్చించుకుని బైకాట్ చేయాలని నిర్ణయించుకున్నారు. సభలో ప్రకటించడంతో ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి కల్పించుకుని కోరంపై ఎంపీడీఓ రాజును అడిగారు. అధికారులు ఎక్కడ ఉన్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన లేదంటూ సమావేశం రద్దు చేయాలని వెళ్లి పోయారు. కాగా 10మంది అధికారులు వివరణ ఇచ్చే ప్రయత్నం చేసినా వినిపించుకోలేదు. రిజిస్టర్‌లో సంతకాలు చేయడానికి ఒప్పుకోలేదు. తెల్ల కాగితంపై సంతకాలు చేసి ఎంపీడీఓకు అందించి వెళ్లిపోయారు. మొత్తానికి 20మందిలో 17మంది ఉదయం 11.30గంటల వరకే రాగా ముగ్గురు అధికారులు ముందస్తు అనుమతితో హాజరు కాలేదు. కాగా సాకులు చెప్తూ ఎంపీపీ సమావేశం వాయిదా వేయడం పై తీవ్ర విమర్శలు వచ్చాయి. గౌరవ సభ్యులు ప్రభుత్వాల నిర్లక్ష్యానికి బైకాట్ చేస్తున్నామని చెప్తే దాటవేయడానికి అధికారులపై నింద మోపి సమావేశం రద్దు చేశారు. అధికారుల సమయపాలన లేదంటే ఎంపీడీఓ, ఎంపీపీల వైఫల్యమే కారణమన్న విమర్శలు వస్తున్నాయి. కాగా అధికారులు కలెక్టరేట్‌కు సమావేశం రద్దుపై నివేదిక ఏమని పంపిస్తారో చూడాల్సి ఉంది.

దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దు

మరికల్: వరి ధాన్యం దళారులకు అమ్మి మోసపోవద్దని జెడ్పీవైస్ చైర్ పర్సన్ సురేఖ అన్నారు. మండలంలోని లాల్‌కోట చౌరస్తాలో శుక్రవారం తీలేర్ విండో కార్యాలయంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 24న రైతులకు ధాన్యం బస్తాలను అందజేస్తామన్నారు. క్వింటాల్ ధాన్యంకు ప్రభుత్వం రూ. 2060 కేటాయించిందన్నారు. రైతులు దళారుల మాటలు నమ్మితే నష్టపోతారని గుర్తు చేశారు. విండో అధ్యక్షులు రాజేందర్‌గౌడ్, సత్యానారాయణరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పనుల పరిశీలన

దామరగిద్ద: మండల కేంద్రంలోని ఉర్దూమీడియం పాఠశాలలను ఎంఈఓ వెంకటయ్య ఆకస్మికంగా తనఖీ చేశారు. మన ఊరు మన బడి పనులను పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. మే ఆఖరు వరకు నూతన భవనాలు అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు.

మండల కమిటీ ఎన్నిక

కోస్గి: గుండుమాల్ మండల కాంగ్రెస్ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు పార్టీ సీనియర్ నాయకుడు సురేష్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎన్నిక నిర్వహించారు. రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల కమిటీ గౌరవ అధ్యక్షుడిగా రాఘవరెడ్డి, అధ్యక్షుడిగా విక్రం రెడ్డి, ఉపాధ్యక్షులుగా గోపాల్ గౌడ్, సురేష్‌రెడ్డి, వసంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గోపాల్‌రెడ్డి, ముఖ్య సలహాదారులుగా గాల్‌రెడ్డి, బుగ్గారెడ్డి, నారాయణ రెడ్డితోపాటు పలువురిని కార్యదర్శులుగా, సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీతో పదవి ప్రమాణ స్వీకారం చేయించారు. టీపీసీసీ సభ్యుడు వార్ల విజయ్ కుమార్, కోస్గి మండల పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు గోవర్ధన్‌రెడ్డి, భాను నాయక్, ఇద్రీస్, నాయకులు బెజ్జు రాములు, తుడుం శ్రీనివాస్, నాగులపల్లి నరేందర్, శ్రీనివాస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

25న ఆవిర్భావ వేడుకలు

మరికల్: బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలను ఈనెల 25న నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు లంబడి తిరుపతయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేడుకలకు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మరికల్: మండలంలోని పల్లెగడ్డ వద్ద శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అక్రమంగా ఆటోలో మరికల్‌కు బియ్యం తరలిస్తున్నారని నమ్మదగిన సమాచారం రావడంతో పట్టుకున్నామని వివరించారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీటీ కాళప్ప తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



బహుమతులు అందిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

నర్వ: పల్లె పల్లెకు వీజేఆర్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి తమవంతుగా కృషిచేస్తానని వీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. నాగిరెడ్డిపల్లిలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలను ఆయనకు వివరించారు. కొన్ని రోజులుగా 3500 ఎకరాల ఆయకట్టుకోసం ఏర్పాటు చేసిన నాగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకం మూతపడిందన్నారు. మోటార్లు, పైపులైన్ మరమ్మత్తు చేపట్టి ఆదుకోవాలని మొరపెట్టుకున్నారు. దీంతో ఆయన స్పందించి విషయాన్ని ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని వివరించారు. అదేవిధంగా పాఠశాలకు త్వరలో స్మార్ట్‌టీవీని అందజేస్తానన్నారు. అనంతరం జిల్లాస్థాయిలో ఒకాబులరీ టెస్ట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. ఎస్ఎంసీ చైర్మన్ జంగిటి వెంకటన్న, రాజేష్, రామ్‌చెంద్రి, రామాంజనేయులు, చందు, మాసన్న, సవరన్న, రాము, రావలి రాజు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు ఇవ్వాలి



కోటకొండలో సర్వే చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : ఖాళీ స్థలాలు ఉన్న వారికి గృహలక్ష్మి పథకం కింద రూ.10లక్షలు అందించాలని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌజన్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కోటకొండ గ్రామంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేపట్టారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నెల 24న కలెక్టరేట్ ముందు ధర్నా చేపడుతున్నట్లు వివరించారు. రాములు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

నారాయణపేట టౌన్ : పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, అదేవిధంగా సొంత ఇల్లు లేని వారికి రూ. 10 లక్షలు ఇంటి నిర్మాణం కోసం అందజేయాలని సీపీఐ(ఎంఎల్) నాయకులు శుక్రవారం డిమాండ్ చేశారు. 24న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట టౌన్ : పేదలకు ఇళ్ల స్థలాలు, స్థలాలు ఉన్నవారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) ప్రజా పంథా జిల్లా కార్యదర్శి బి. రాము, డివిజన్ కార్యదర్శి కాశీనాథ్, పట్టణ కార్యదర్శి కెంచి నారాయణ డిమాండ్ చేశారు. పట్టణంలో ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేపట్టారు. ఇళ్లు లేని వారిని గుర్తించి వివరాలు సేకరించారు.

మద్దూర్: పేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఏళ్లు గడుస్తున్నా ఇవ్వలేదని సీపీఐ (ఎంఎల్)నాయకులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో అర్హులందరికీ ఇళ్ల నిర్మాణం కోసం రూ. పదిలక్షలు ఇవ్వాలంటూ కొత్తపల్లి మండల తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. మండల కార్యదర్శి కొండ నర్సిములు నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

నారాయణపేట రూరల్ : విద్యతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజు అన్నారు. మండలంలోని పేరపళ్ల గ్రామంలో శుక్రవారం ముదిరాజ్ కమిటీని ఎన్నుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ముదిరాజులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వీటన్నింటికీ విద్య ఒక్కటే సరియైన దారి అని అన్నారు. గ్రామ అధ్యక్షుడుగా అంజప్ప, ప్రధాన కార్యదర్శిగా అంజప్ప, ఉపాధ్యక్షులుగా వెంకటప్ప, లక్ష్మప్ప, లక్ష్మణ్, కార్యదర్శులుగా కిష్టప్ప, వెంకటప్పలను ఎన్నుకున్నారు. అనంతరం వారిని శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మిర్చి వెంటకయ్య, శంకర్, నారాయణ, కతలప్ప, గోపాల్, బాలప్ప, సాయి పాల్గొన్నారు.

డీటీపై చర్య తీసుకోవాలని వినతి

మక్తల్: తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న డీటీ వాసుదేవ్‌రావుపై చర్యలు తీసుకోవాలని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ తిరుతయ్యకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ విలేకరి సమస్యపై వివరాలు అడిగితే దురుసుగా ప్రవర్తించాడని ఆరోపించారు. కార్యక్రమంలో పాత్రికేయులు నవీన్‌కుమార్, శ్రీనివాస్, అంజయ్యచారీ, అంజన్‌ప్రసాద్, సురేందర్, ఎల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'కంటివెలుగు'



పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నారాయణపేట టౌన్ : కంటి వెలుగు కార్యక్రమం 4వ వార్డు పరిధిలోని సింగార్‌బేస్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతోంది. వైద్యులు మోనేష్ చారీ శుక్రవారం కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి అద్దాలు అందజేశారు.

ధన్వాడ: మండలంలో కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. ప్రస్తుతం రాంకిష్టాయిపల్లిలో కంటివెలుగు శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని కంటి సంబంధ సమస్యలు ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని, పరీక్షలు చేయించుకుని అవసరమైన మందులు, అద్దాలు తీసుకోవాలని సర్పంచ్ మాధవరెడ్డి సూచించారు.

ఊట్కూర్: మండలంలోని మల్లెపల్లిలో గత వారం రోజులుగా కొనసాగిన కంటి వెలుగు కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ భవానీ మాట్లాడుతూ వారం రోజుల్లో 836 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. 124 మందికి దగ్గరి చూపు అద్దాలు, 152 మందికి దూరం చూపు అద్దాలకు ఆర్డర్ ఇచ్చామన్నారు. 75 మందికి శుక్లాలు ఉన్నందున ఆపరేషన్లకు సిఫారసు చేశామని వివరించారు. నాగిరెడ్డిపల్లిలో సోమవారం నుంచి కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. సిబ్బంది మహేశ్వరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల తరలింపు

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలో మున్సిపల్ కమిషనర్ సునీత ఆదేశాల మేరకు శుక్రవారం స్పెషల్ టీం ఆధ్వర్యంలో వీధికుక్కల తరలింపు చేపట్టారు. కుక్కల బెడద అధికం కావడంతో కూరగాయల మార్కెట్, ధూల్‌పేట, బహర్‌పేట, శాతవాహన కాలనీలో చర్యలు తీసుకున్నారు. వీటిని డంపింగ్ యార్డుకు తరలించి, అక్కడ పశు వైద్యాధికారులతో సంతానోత్పత్తి కాకుండా టీకాలు వేయించి సుదూర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు వివరించారు. దాదాపు 50కి పైగా కుక్కలను తరలించామన్నారు. మరికొన్ని వార్డుల్లో త్వరలోనే చర్యలు చేపడతామని కమిషనర్ వివరించారు. మున్సిపల్ అధికారులు శ్రీనివాసులు, శ్రీధర్, నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బండారు ఉత్సవాలకు ఆహ్వానం

మాగనూర్: మండలంలోని వర్క్యూర్‌లో ఈ నెల 28 నుంచి నిర్వహించనున్న శ్రీ రేణుక ఎల్లమ్మ బండారు ఉత్సవాల నేపథ్యంలో కురువసంఘం నాయకులు శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్యను కలిసి ప్రత్యేకంగా ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తామని అన్నారు. గత ఏడాదే వేడుకలు నిర్వహించాల్సి ఉన్నా కరోనా నేపథ్యంలో వాయిదా వేశామని వివరించారు. కార్యక్రమంలో ప్రధాన పూజారులు ఎర్రప్ప, రామపోల్ల లింగప్ప, ఆనంపల్లి లింగప్ప తదితరులు పాల్గొన్నారు.